క్లుప్తంగా

గెడ్డలో పూడికల తొలగింపు



శ్రీరామ్‌నగర్ గెడ్డలో పొక్లెయిన్‌తో పూడికలు తొలగిస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు శ్రీరామ్ నగర్ గెడ్డలో పూడికలు తొలగించే పనులు శుక్రవారం చేపట్టారు. జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఎస్‌ఎస్ వెంకటరమణ ఆదేశాల మేరకు గెడ్డలో పేరుకుపోయిన చెత్తను పొక్లెయిన్ ద్వారా తొలగించి నేరుగా లారీల్లో తరలించారు. ఈ పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. గోపి పర్యవేక్షించారు. పూడికల తొలగింపు శనివారం కూడా కొనసాగిస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు.

బోరుబావికి మరమ్మతులు



బోరుబావికి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెం దిగువ ప్రాంతంలో బోరుబావి నెల రోజుల నుంచి పని చేయడం లేదు. స్థానిక నాయకుడు అప్పలరాజు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించారు. శుక్రవారం నీటిసరఫరా విభాగం సిబ్బంది బోరుబావికి మరమ్మతులు చేపట్టారు.దీంతో స్థానిక వాసులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత

విశాఖ విద్య: కేజీహెచ్‌లో మృతి చెందిన వ్యక్తిని తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో మమత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించి మానవీయతను చాటుకున్నారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. అతనికి కుటుంబ సభ్యులు ఎవ్వరూ లేకపోవడంతో విషయం తెలుసుకున్న మమత చారిటబుల్ ట్రస్టు నిర్వాహకురాలు ఎల్లేటి మమత అంత్యక్రియలు నిర్వహించేందుకు ముందుకొచ్చారు. జ్ఞానాపురం శ్మశానవాటికలో శుక్రవారం శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఆమెను పలువురు అభినందించారు.

ప్రగతి పథం.. సంక్షేమ రథం



ఎస్సీబీసీ కాలనీలో నూతనంగా వేసిన సీసీరోడ్డు



మురుగు పారేందుకు నిర్మించిన కాలువ

- ఎస్సీబీసీ కాలనీ వాసులకు రూ.20.58 కోట్ల లబ్ధి
- రహదారులు, కాల్వలు అభివృద్ధి
- కమ్యూనిటీ హాలు ఆధునికీకరణ
- రూపురేఖలు మారిన పాఠశాల

గోపాలపట్నం: అన్ని ప్రాంతాలు.. అన్ని వర్గాలు అభివృద్ధి చెందితేనే నిజమైన ప్రగతి అని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారు. ప్రభుత్వ ఫలాలు ప్రజలకు నేరుగా అందిస్తున్నారు. అభివృద్ధి పనులు అన్ని ప్రాంతాల్లో చేపడుతూ ప్రగతి అంటే ఇలా ఉంటుందని చేతల్లో చూపిస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి మౌలిక వసతుల లేమితో ఇబ్బందులు పడుతున్న ప్రజలు నేడు హాయిగా జీవిస్తున్నారు. దీనికి నిదర్శనంగా జీవీఎంసీ92వ వార్డు ఎస్సీబీసీ కాలనీ 21086458 సచివాలయాన్ని చెప్పుకోవచ్చు. రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయడంతో రూపు రేఖలు మారాయి. ఈ సచివాలయం పరిధిలో ఏకంగా అభివృద్ధి, సంక్షేమం కింద రూ.20.58 కోట్లు అందించారు.దీంతో ఈ ప్రాంత ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

- నాడు– నేడు ద్వారా హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రూ1.47కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.
- ఎస్సీబీసీ కాలనీ ఎంపీపీ స్కూల్‌లో రూ.18లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు.
- రూ. 81.05 లక్షలతో పలు రహదారులు నిర్మించారు.
- కమ్యూనిటీ హాలు మరమ్మతులు రూ. 3లక్షలతో పూర్తి చేశారు.
- కాపు కల్యాణ మండపం రూ.1.80కోట్లతో నిర్మిస్తున్నారు.



మరమ్మతులు చేసిన తర్వాత కమ్యూనిటీ హాలు

అభివృద్ధి చాలా బాగుంది



మా గ్రామంలో అభివృద్ధి చాలా బాగుంది. ఈ విధమైన అభివృద్ధి పనులు ఇంతక ముందు చూడలేదు. నాణ్యమైన రహదారులు, కాల్వలు వేశారు. మా ప్రాంతంలో కాపు కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి కోరుకుంటున్న కల్యాణ మండపం నెరవేరుతోంది.

– సొలాపు రమణ ఎస్సీబీసీ కాలనీ

కాల్వలు, రోడ్లు వేశారు



మా గ్రామంలో చాలా మేరకు కాల్వలు రోడ్లు వేశారు. పాఠశాలలు బాగు చేశారు. కొత్తగా హైస్కూల్‌లో డిజిటల్ చదువులు తీసుకు వచ్చారు. ట్యాబులు కూడా ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమంతో మా గ్రామం చాలా బాగుపడింది. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ద్వారా సచివాలయాలు వచ్చాయి. ఇంటికే సేవలు అందిస్తున్నారు. పాలన చాలా బాగుంది.

–కె. శోభారాణి ఎస్సీబీసీకాలనీ

జగనన్న ఆదుకున్నారు



జగనన్న సీఎం అయిన తర్వాత ఎంతో ప్రయోజనం పొందుతున్నాం. రూ.18500 సాయంతో వృత్తి పనికి అవసరమైన సామగ్రి కొనుగోలు చేస్తున్నాను. పలు పథకాల ద్వారా మా కుటుంబం లబ్ధి పొందింది. . ఇంత గొప్ప ముఖ్యమంత్రి మళ్లీ మళ్లీ సీఎంగా రావాలి. మేమంతా జగనన్నకు అండగా నిలబడతాం.

– పి. నరసమ్మ ఎస్సీబీసీ కాలనీ

ఈ సచివాలయం పరిధిలో సంక్షేమ ఫలాలు ఇదిగో...

పథకం	లబ్ధిదారులు	మొత్తం నగదు (రూ. లక్షల్లో)
జగనన్న అమ్మ ఒడి	367	1,66,02,634
జగనన్న విద్యా దీవెన	228	80,72,530
జగనన్న వసతి దీవెన	197	29,39,527
వైఎస్సార్ రైతు భరోసా	148	62,40,500
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	7	1,09,628
రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ	9	25,560
వైఎస్సార్ మత్స్యకార భరోసా	2	50,000
వైఎస్సార్ పెన్షన్ కానుక	391	3,83,36,000
వైఎస్సార్ చేయూత	206	84,93,750
వైఎస్సార్ ఆసరా	623	1,22,93,885
వైఎస్సార్ సున్నా వడ్డీ	841	32,81,427
వైఎస్సార్ కాపు నేస్తం	08	3,45,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	13	3,45,000
కల్యాణమస్తు	1	1,00,000
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	175	68,06,582
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	102	7,45,425
హౌసింగ్	130	76,52,496
వైఎస్సార్ బీమా	05	10,00,000
వైఎస్సార్ వాహన మిత్ర	69	19,60,000
జగనన్న చేదోడు	29	6,60,000
జగనన్న తోడు	29	15,688

పరోక్షంగా పొందిన ప్రయోజనాలు

పథకం	లబ్ధిదారులు	నగదు(రూ.లక్షల్లో)
ఇంటి స్థలాలు	254	6,24,84,000
జగనన్న విద్యా కానుక	175	12,42,850
ట్యాబులు	14	1,85,108
జగనన్న తోడు	100	18,61,900
జగనన్న గోరుముద్ద	187	18,52,609
ఇంటింటికీ రేషన్	961	2,09,92,084





సామాజిక న్యాయానికి చిహ్నం



సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్లా లక్ష్మణరావు తదితరులు

- విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుతో హర్షాతిరేకాలు
- సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మల్కాపురం: తమ ఆరాధ్య దైవం అయిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసి సామాజిక న్యాయానికి చిహ్నంగా మార్చారని 62వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్లా లక్ష్మణరావు అన్నారు. విజయవాడలో అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడంపై పారిశ్రామిక ప్రాంత దళిత సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా 59వ వార్డు నక్కవానిపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతో మంది పాలకులు వచ్చినా తమ జాతిని అంతగా ఆదరించలేదన్నారు.కానీ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు తమ వారికి ఉన్నత పదవులు,ఉన్నత విద్యకు సహకారం అందిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో పలు పార్టీల వారు డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్‌పై ప్రశంసలు కురిపిస్తూ ముగిశాక అంబేడ్కర్‌ను విస్మరించేవారన్నారు. కానీ అధికారం లేనప్పుడు అంబేడ్కర్‌కు ఎంతటి గౌరవం ఇచ్చారో,అధికారం వచ్చాక కూడా అదే గౌరవం జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్నారని అందుకు నిదర్శనమే భారీ విగ్రహం ఏర్పాటు అని వివరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పూండి మల్లేశ్వరరావు, కొట్నాన రవి,గుంట సుందర్‌రావు,పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి

డిప్యూటీ సీటీఎం సత్యనారాయణ



గ్యారేజీ సిబ్బందితో మాట్లాడుతున్న సీటీఎం సత్యనారాయణ, డిపో మేనేజర్ రాజశేఖర్

గోపాలపట్నం: డిపోలో బస్సుల నిర్వహణకు సంబంధించి డ్రైవర్ల ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని డిప్యూటీ సీటీఎం జి. సత్యనారాయణ అన్నారు. భద్రత మాసోత్సవాల్లో భాగంగా సింహాచలం ఆర్టీసీ డిపోలో శుక్రవారం మెయింటెనెన్స్ డే నిర్వహించారు. గ్యారేజీ సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. బస్సుల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. పనిలో ఒకరికి ఒకరు సహాయపడాలని సూచించారు. చందనోత్సవం, గిరి ప్రదర్శన వంటి ఉత్సవాల్లో ఫ్రీ బస్సులు ఇబ్బందులు లేకుండా సర్వీలు అందించినందుకు అభినందించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కె. రాజశేఖర్, ఏఎం(ట్రాఫిక్) సాయి తులసి, సూపరింటెండెంట్ (మెకానికల్) కొండలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధిలోని ములగాడ ఫీడర్‌లో వార్షిక మరమ్మతులు చేపడుతున్న కారణంగా పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములగాడ హౌసింగ్‌కాలనీ, కొత్త నక్కవానిపాలెం,పాతచెక్ పోస్టు ఏరియా, గాజువాక ఆర్టీసీ డిపో ఏరియా,ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీ,హనుమాన్‌నగర్,గణపతినగర్ ప్రాంతాలకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకుంటుందని ఆయన పేర్కొన్నారు.

'21న రాజకీయ నిర్ణయం వెల్లడిస్తా..'

గోపాలపట్నం: ఈ నెల 21న అనకాపల్లిలో శ్రేయోభిలాషులు, నాయకులతో సమావేశం నిర్వహించి తన రాజకీయ నిర్ణయం తీసుకుంటానని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ తెలిపారు. హైదరాబాద్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసి శుక్రవారం విశాఖ వచ్చిన ఆయన విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్‌తో రాష్ట్రంలోని పలు అంశాల గురించి చర్చించామని తెలిపారు. తన రాజకీయ శ్రేయోభిలాషులతో చర్చించి తన నిర్ణయం తెలియజేస్తానన్నారు. ఆయనకు స్వాగతం పలికేందుకు అభిమానులు, నాయకులు ఎయిర్‌పోర్టుకు తరలివచ్చారు.



ఎలక్ట్రీషియన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే స్థాపించిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (నేక్) ద్వారా నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణ అందజేస్తున్నట్లు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్‌వీఎస్‌ఎస్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) పథకం కింద ఉచిత శిక్షణ, ఉపాధి నిమిత్తం నేరుగా అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. దీనికి పది పాసైన వారు అర్హులని, ఈ శిక్షణ రెండు మాసాలు ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 8309059974 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



పూజలు చేస్తున్న అర్చకులు

ఎంవీపీకాలనీ: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకుని టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్, విశాఖ ధార్మిక సలహా మండలి, విశాఖ సాగర దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం కొనసాగాయి. ఎంవీపీకాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా సీతారాములకు సహస్ర దీపాలంకరణ చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా ఈకార్యక్రమం జరిగింది.



వేమన పద్యం అజరామరం



వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు, అతిథులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రజాకవి వేమన జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అతిథులు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశానికి తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమైక్యభారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య మాట్లాడుతూ సమాజంలో ఉన్న సామాజిక రుగ్మతలపై వేమన అక్షరాయుధంతో చైతన్యం కలిగించారన్నారు. మానవ జీవన విధానాన్ని ఆయన పద్యాలు ప్రతి కోణంలోనూ స్పృశించాయని.. అందుకే వేమన ప్రజాకవిగా పేరుగాంచారన్నారు. తెలుగు విభాగ సీనియర్ ఆచార్యుడు ఆచార్య జి.యోహాన్ బాబు మాట్లాడుతూ వేమన పద్యాలు క్లుప్తంగా ఉన్నప్పటికీ.. అందులోని భావార్థం చాలా విస్తృతమైనదన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ జానపద సాహిత్యాన్ని ఆదరించినట్లు.. వేమన సాహిత్యాన్ని ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. తెలుగు సాహిత్యంలో ఆయన పద్యాలు అజరామరంగా నిలిచిపోయాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ సీతారత్నం, డాక్టర్ ఎ.ఈశ్వరమ్మ, కె.రత్నశేఖర్, డాక్టర్ పి.లావణ్య, డాక్టర్ ఎ.వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎల్.గిరీష్ కుమార్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.